వ్యాధుల కాలం..
అప్రమత్తత శూన్యం!

- వర్షాలతో పరిసరాలు అపరిశుభ్రం
- మురుగుకూపాల్లో వృద్ధి చెందుతున్న దోమలు
- జ్వరాల బారిన పడుతున్న ప్రజానీకం
- నివారణకు కానరాని ముందస్తు ప్రణాళిక
- భారమంతా సచివాలయ ఏఎన్ఎంలపైనే
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ



90వ వార్డులో దోమలవ్యాప్తికి కారణమవుతున్న మురుగునీరు

విశాఖ విద్య: సీజనల్ వ్యాధులు మాటేశాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కాలనీల్లోని పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. మేజర్ డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజానీకం జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలం మొదలైతే శివారు కాలనీల్లో మలేరియా, డెంగ్యూ జ్వరాలు విజంభిస్తాయి. గతేడాది నమోదైన నివేదికలు ఇందుకు నిదర్శనం. అయినప్పటికీ జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ అధికారులు చోద్యం చూస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు సిద్ధం చేసిన ముందస్తు ప్రణాళిక లపై ఇప్పటివరకు ఉన్నత స్థాయిలో సమీక్ష సైతం లేదు. సీజన్‌లో ప్రమాద ఘంటికలు మోగే అవకాశం ఉందని ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు.

హైరిస్క్ ఏరియాలపై అప్రమత్తత ఏది

జోన్–5 పరిధి పారిశ్రామిక ప్రాంతంలోని 47, 48 ,59 ,60 వార్డుల పరిధిలో ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయా వార్డులను హైరిస్కు ప్రాంతంగా గుర్తించి వర్షాకాలం ప్రారంభంలోనే ప్రతీ ఏటా వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం కాలనీల్లో ప్రజానీకం ఆరోగ్య పరిరక్షణకు ఎటువంటి కార్యాచరణ కానరావడం లేదు. ముందస్తు ప్రణాళికలు అమల్లో జీవీఎంసీ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

అధ్వానంగా డ్రైనేజీలు

నియోజక వర్గం పరిధిలోని పారిశ్రామిక ప్రాంతంతో పాటు 52వ వార్డు కరాస, రిక్షా కాలనీ, 57వ వార్డులోని సాకేత పురం, అదేవిధంగా 90 వార్డు పరిధి లక్ష్మీనగర్, కాకానినగర్ పరిసర కాలనీల్లో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోతుంది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే లక్ష్మీనగర్ ఏరియాల్లో డ్రైనేజీల్లో మురుగునీరు రోడ్లపైకి పారింది. బుచ్చిరాజుపాలెం చేపల మార్కెట్ వద్ద డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకు పోయాయి. భారీ వర్షాలు పడితే పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజానీకం భయపడుతున్నారు.

దోమల మందు చల్లేవారేరి



సీజనల్ వ్యాధుల నివారణ కోసం జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ తో పాటు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మలేరియా విభాగం కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉం ది. అదే విధంగా దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలి. మలేరియా విభాగం ఎక్కడున్నారో కూడా ప్రజానీకానికి తెలయని పరిస్థితులు ఉన్నాయి. కనీసం కాలనీల్లో దోమల మందు చల్లేవారు కూడా లేరని ప్రజానీకం అంటున్నారు. సచివాలయాల ఏఎన్ఎంల పైనే భారమంతా వేసి ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది కాలనీల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజానీకం అంటున్నారు.

పర్యవేక్షణ అధికారులు ఎక్కడ

జోన్ –5 పరిధిలో ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. కానీ, ప్రజారోగ్యశాఖను పర్యవేక్షించే అధికారి లేరు. ప్రస్తుతం జోన్ – 4 ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ శాఖ కార్యకలాపాలపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. సీజనల్ వర్కర్ల నియామకం జరిగినా ఎంతమంది విధులకు హాజరవుతున్నారనేది అడిగేవారు లేక ప్రజాధనం కూటమి కార్యకర్తలకు ఫలహారంగా మారుతోంది. వ్యాధుల బారిన పడి ప్రాణాలు గాల్లో కలిసి పోక ముందే ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ



బుచ్చిరాజుపాలెం చేపల మార్కెట్ వద్ద గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

క్లుప్తంగా

కేవీలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో మిగిలిన సీట్ల భర్తీకి పాఠశాల యాజమాన్యం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 4,9 తరగతుల్లో మిగిలిన సీట్లు, 6వ తరగతిలో మిగిలి ఉన్న ఎస్టీ కేటగిరీ సీట్లు, 10, 12 తరగతుల్లో మిగిలిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల సీట్ల భర్తీ ఈనెల 8న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. జూలై 10న 4,6,10, 12 తరగతులకు లాటరీ ద్వారా, 9వ తరగతికి పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

300 మందికి వైద్య పరీక్షలు



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యురాలు

విశాఖ విద్య: బాజీ జంక్షన్‌లోని సెయింట్ థెరిసా హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అపోలో హాస్పిటల్స్ సహకారంతో పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ రోసారియోతో కలిసి కరస్పాండెంట్ క్లాడియస్ రోసారియో ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ ఫజాలా మెహ్నాజ్, డాక్టర్ ఏమండా విద్యార్థులకు, తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 300 మంది సేవలు అందజేశారు. డాక్టర్ ఫజాలా మెహ్నాజ్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. వైద్యుడిని సంప్రదించకుండా సొంతంగా యాంటీ బయోటిక్ మందులు వాడొద్దని తెలిపారు.

రంగా సేవలు చిరస్మరణీయం



రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విప్ గణబాబు

మల్కాపురం: సామాజిక న్యాయం కోసం పోరాడిన నాయకుడు దివంగత నేత వంగవీటి రంగా అని ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. రంగా జయంతి సందర్భంగా 59వ వార్డు పరిధిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.కార్యక్రమంలో నాయకులు అంగ దుర్గాప్రశాంతి, పాలిమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఇటీవల జరిగిన డీఆర్సీ, దిశా సమావేశాల్లో చర్చించిన అంశాలపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం పలు విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలను ఆయా శాఖలు సమీక్షించి, వాటికి త్వరితగతిన పరిష్కారాలు చూపాలన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో భాగంగా ఆయా శాఖల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు, సాధించిన ప్రగతి గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డీఆర్సీ, దిశా సమావేశాలకు సంబంధించిన ఏటీఆర్‌ను వారం రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్, ఆర్డీవోలు, ఎస్‌డీసీలు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో గోరింటాకు సంబరాలు



అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90 వార్డు బుచ్చిరాజుపాలెంలోని దుర్గాలమ్మ, బంగారమ్మ అమ్మవార్లకు ఆషాఢ మాస మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోరింటాకు సంబరాలు వైభవంగా జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని గోరింటాకు అమ్మవారికి అలంకరించి, అనంతరం వారు కూడా అలంకరించుకున్నారు. శ్రీ త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అమ్మవారి సన్నిధిలో గోరింటాకు పెట్టుకోవడంపై మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు అమ్మ వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు యూనిఫారాల అందజేత



విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న సీఎంఆర్ సిబ్బంది, హెచ్‌ఎం స్వర్ణలత

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్ 2 విద్యార్థులకు సీఎంఆర్ సంస్థ ప్రతినిధులు దుస్తులు అందించారు. హెచ్‌ఎం స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇలాంటి సంస్థలు అండగా నిలవడం సంతోషదాయకంగా ఉందన్నారు. సీఎంఆర్ మేనేజర్ రాయుడు మాట్లాడుతూ సీఎంఆర్ సంస్థ యజమాని మావూరి వెంకటరమణ ఆదేశాల మేరకు ఏకరూప దుస్తులు అందించామని తెలిపారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్



ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

గోపాలపట్నం: ఏడాది పాలనలో చంద్రబాబు ప్రజలను ఏవిధంగా మోసం చేశాడో వివరిద్దామని మాజీ ఎమ్మెల్యే, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. సీతమ్మధారలోని క్యాంప్ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ ముఖ్యనేతలతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత ఇటీవల నియమించిన వార్డు అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో బాబు చేసిన మోసాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా పార్టీ ఆధ్వర్యంలో రుషి కొండలోని ఏ–1 గ్రాండ్‌లో శనివారం నిర్వహించే కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

6న మరిడిమాంబ కల్యాణ మండపంలో..

అలాగే ఈ నెల 6న మల్కాపురంలోని మరిడి మాంబకల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 56వ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, 57వ వార్డు అధ్యక్షుడు పిన్నింటి అప్పల రాజు, 58వ వార్డు అధ్యక్షుడు గులిగిందల కృష్ణ 60వ వార్డు అధ్యక్షుడు అంగ వర్మ, 61వ వార్డు అధ్యక్షుడు పిలకా రామ్మోహన్‌రెడ్డి, 62వ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, 63వ వార్డు అధ్యక్షుడు ఎలగాడ రాజు, 90వ వార్డు అధ్యక్షుడు చుక ప్రసాద రెడ్డి, 92వ వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు, మాజీ కార్పొరేట్లు గల్లా శ్రీను, పిల్లా కన్నబాబు, మాజీ వ్యవసాయ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, అనుబంధ సంఘాల నాయకులు రాయపురెడ్డి అనిల్, పూండి మల్లేశ్వరరావు, యల్లపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా శక్తి యాప్



గోపాలపట్నం హైస్కూల్‌లో శక్తి యాప్ గురించి వివరిస్తున్న హెచ్‌సీ వెంకటరావు

గోపాలపట్నం: శక్తి యాప్ మహిళలకు ఒక ఆయుధంగా పని చేస్తుందని హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి యాప్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈగిల్ టీమ్ ద్వారా ఆకతాయిలు మహిళలను ఇబ్బందులకు గురి చేస్తే శక్తి యాప్ ఓపెన్ చేసి ఫోన్‌ను కదిలిస్తే చాలని మీ లొకేషన్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుందని తెలిపారు. వెంటనే అక్కడికి దగ్గరలో ఉన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటారని చెప్పారు. విద్యార్థులు గంజాయి వంటివి సేవించి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. వీటి వల్ల కలిగే అనారోగ్యం, వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



లేబర్ గేటు వద్ద నినాదాలు చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

మల్కాపురం: ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలిగించేలా కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న దేశ వ్యాప్తంగా చేపట్టబోవు సమ్మెను జయప్రదం చేయాలని పారిశ్రామిక ప్రాంత అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ అంశంపై హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి,పెంటరావు, ఇంటక్ నాయకులు తాతబాబు,ఏఐటీయూసీ నాయకులు గుడాల రాంబాబు తదితరులు మాట్లాడుతూ లేబర్ కోడ్ విధానం వల్ల కార్మికులకు నష్టం కలుగుతుందన్నారు. ఇలాంటి చట్టాలను తీసుకు వస్తున్న నరేంద్రమోదీ సర్కార్ తీరుపై దేశ వ్యాప్తంగా కార్మికులు ఆగ్రహంతో ఉన్నారన్నారు. దీనిపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నోరు మెదపకపోవడం దారుణమన్నారు. కార్మిక సమస్యలపై 9న చేపట్టబోవు సమ్మెను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెరకాపు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విప్లవవీరుడు అల్లూరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అప్పలరాజు తదితరులు

విశాఖ విద్య: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ అధ్యక్షుడు డాక్టర్ నమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో ఎన్ఏడీ దరి బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులతో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి అప్పలరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారిని ఎదురించి గిరిజనుల అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారన్నారు. అల్లూరి ఆశయ సాధన కోసం నేటి తరం యువతీ, యువకులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లాడి అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వేదుల ప్రసాద్, పెందుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కాళ్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్‌కాలనీలో...



ఎస్సార్‌కాలనీలోని అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి అల్లూరి సీతారామరాజుకాలనీలో శుక్రవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజేయ అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజలకు అండగా నిలిచారన్నారు. అడవి తల్లి బిడ్డలకు అండగా నిలిచి, గిరిజనుల ఆత్మగౌరవానికి అలుపెరగని పోరాటం చేసిన గొప్ప వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, ఎస్‌వీ త్రినాథ్, డి.గోపాలరావు, వై.కనకేశ్వరరావు, టి.కామేశ్వరరావు, మహిళా నాయకురాలు గుడాల జయ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో నియామకాలపై ఏఐటీయూసీ అభ్యంతరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తూనే, మరో వైపు టోటల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ (టీఎంసీ) పేరిట ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు డాక్టర్ బూసి వెంకటరావు అన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఆర్.ఎం.హెచ్.పి విభాగంలో ఇటీవల అనేక మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని గుర్తుచేశారు. అయితే అదే ఆర్.ఎం.హెచ్.పి విభాగంలో టీఎంసీ కాంట్రాక్ట్ పొందిన ఆదిత్య లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తమ వద్ద విధులు నిర్వహించేందుకు నగరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తోందని డాక్టర్ వెంకటరావు వెల్లడించారు. ఈ విభాగంలో తొలగించిన అనుభవం కలిగిన కాంట్రాక్ట్ కార్మికులను టీఎంసీలో చేర్చుకుంటే వారికి ఉపాధి లభించడమే కాకుండా, ప్లాంట్‌కు నైపుణ్యం కలిగిన కార్మికులు దొరికేవారని ఆయన అభిప్రాయపడ్డారు. టీఎంసీల్లో గతంలో తొలగించిన కార్మికులనే నియమించాలని డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.


మత్తుతో జీవితాలు చిత్తు



కాన్వెంట్ కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల, ఈగల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కాన్వెంటు కూడలిలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ మాట్లాడుతూ మత్తుతో యువత జీవితాలు చిత్తు చేసుకుంటున్నారన్నారు. జ్ఞానాపురం కళాశాల నుంచి కాన్వెంట్ కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మత్తు పదార్థాలకు నో చెప్పండి -మంచి జీవితాన్ని ఎంచుకోండి'అనే నినాదాలతో మానవహారం నిర్వహించారు. మత్తు పదార్థాల వ్యతిరేక దినం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, జంతుశాస్త్ర విభాగాధిపతి, ఈగల్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ ఈ.హరిణి, డాక్టర్ సుధాప్రియా, ఎల్. ప్రవీణ్‌కుమార్, కె.మాణిక్యకుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



మహిళా ముద్దాయిలతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలు లోపల ఖైదీలు ఉండే బ్యారక్‌లను పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్ బాబు, ఇతర అధికారులతో కలిసి స్వర్ణముఖి బ్లాక్‌ను పరిశీలించిన న్యాయమూర్తి, అందులో ఉన్న మహిళా ముద్దాయిలతో మాట్లాడారు. ఏఏ నేరాలపై వారు జైలుకు వచ్చారు, జైలుకు రావడానికి దారితీసిన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారు జైలుకు రావడం వల్ల వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి కూడా ఆరా తీశారు. ఖైదీలకు జైలులో కల్పిస్తున్న సౌకర్యాలు, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్న న్యాయమూర్తి, ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



స్టీల్ సిటీ డిపో వద్ద ధర్నా చేస్తున్న పీటీడీ నాయకులు, కార్మికులు

ఉక్కునగరం: ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీటీడీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్టీల్ సిటీ డిపో వద్ద ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెంటనే 12వ పీఆర్సీ వేసి మధ్యంతర భృతి ప్రకటించాలని, 11వ పీఆర్సీకి సంబంధించి 24 నెలల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. డబుల్ డ్యూటీలకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 800 రూ. వెయ్యికు పెంచాలని డిమాండ్ చేశారు. డిపో కార్యదర్శి బండారు రాము ,పి. పదర్మ, కె. సత్తి బాబు, కె. సీహెచ్.ఎస్. రావు పాల్గొన్నారు.